# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

బుధవారం 9 ఏప్రిల్ 2025 పేజీలు 8




- మేడమ్ సంజున ఫోన్‌లు ఎత్తరు..! సమాధానం చెప్పరు..
- మల్లంపేట్-బౌరంపేట్ గ్రామాల్లో అక్రమ కట్టడాలపై చర్యలకు మినహాయింపు..
- బౌరంపేట్‌లో రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ కాంప్లెక్స్‌లు..!
- అక్రమంగా ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ.. అధికారుల చేతివాటానికి నిదర్శనం..
- మల్లంపేట్‌లో మూడు ఇంటి పర్మిషన్‌లతో.. ఒక్కటే కమర్షియల్ కాంప్లెక్స్..!
- అధికారుల అండతో బోనస్‌గా “అక్రమ సెల్లార్, అదనపు అంతస్తులు”..
- చైన్‌మెన్‌లకు తెలిసినా అధికారులకు సమాచారం ఇవ్వరు..
- వార్తలు వచ్చినా టౌన్‌ప్లానింగ్ అధికారి పట్టించుకోరు..
- ఫిర్యాదులు వచ్చినా ముడుపులకే ప్రాధాన్యత ఇస్తున్న వైనం..
- నిద్రావస్థలో మేడ్చల్ జిల్లా లోకల్‌బాడీ వ్యవస్థ..

### దుండిగల్ మున్సిపాలిటీలో...

# రెసిడెన్షియల్ పర్మిషన్‌తో..! కమర్షియల్ కట్టడాలు..!

### ముడుపులతో ప్రమాదకర కట్టడాలను ప్రోత్సహిస్తున్న టౌన్‌ప్లానింగ్..

మూడు అనుమతులతో.. ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్.. నిబంధనలకు తిలోదకాలు..

అక్రమ నిర్మాణాల దందాలో.. దుండిగల్ మున్సిపాలిటీ మొదటి స్థానంలో ఉందనడంలో అతిశయోక్తి కాదు.. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన నిధులు అధికారుల జేబుల్లోకి వెళ్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.. రెసిడెన్షియల్ పర్మిషన్‌లు మంజూరు చేస్తూ.. కమర్షియల్ కాంప్లెక్స్‌లను ప్రోత్సహిస్తున్నారు.. ఇదంతా టౌన్‌ప్లానింగ్ అధికారుల బహిరంగ దందా అంటూ సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. పత్రికల్లో వార్తలు వచ్చినప్పటికీ..! టౌన్‌ప్లానింగ్ మేడమ్ పట్టించుకోరు.. వివరణకై ఫోన్‌లు చేసినా స్పందించరు.. మల్లంపేట్-బౌరంపేట్ గ్రామాల అక్రమ కట్టడాలు, టౌన్‌ప్లానింగ్ అధికారులకు కాసులు కురిపించే కామధేనువుగా మారాయి.. మున్సిపాలిటీలో ఎక్కడైనా కూల్చివేతలు ఉంటాయి.. కానీ మల్లంపేట్-బౌరంపేట్ గ్రామాల్లో అక్రమ నిర్మాణాలకు చర్యల మినహాయింపు ఉంటుందట.. టిజి-బిపాస్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ..! దుండిగల్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రమాదకర నిర్మాణాలని ప్రోత్సహిస్తున్నారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 8:




బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులో అక్రమ నిర్మాణంలో నారాయణ స్కూల్..



-2లో

# కంచ గచ్చిబౌలి భూములపై ఏఐ ఫొటోలు, వీడియోలు డిలీట్




హైదరాబాద్ పెన్ పవర్: కంచ గచ్చి భూముల వివాదం సరికొత్త మలుపు తిరిగింది. ప్రతిపాదిత భూమిలో జింకలు, నెమళ్లు ఉన్నట్టు ఓ ఫోటో సోషల్ మీడియాలో బాగా సర్క్యులేట్ అయ్యింది. ఈ ఫొటోను సాక్షాత్తు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి జీ జగదీశ్ రెడ్డి, బీఆర్ఎస్ ట్విట్టర్ హ్యాండిల్ నుంచి షేర్ చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని, మూగ జీవాలను కాపాడాలని పోస్టులు పెట్టారు. అంతటితో ఆగకుండా ట్విట్టర్, ఇన్ స్టా, ఫేస్ బుక్, వాట్సాప్, టెలిగ్రామ్ తదితర సోషల్ మీడియా

-3 లో

# సిద్ధిపేట జిల్లాలో బర్డ్ ఫ్లూ నిర్ధారణ.. 15 వేల కోళ్లు చచ్చిపోయినయ్..!

హైదరాబాద్ పెన్ పవర్: సిద్దిపేట జిల్లాలో బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయింది. జిల్లాలోని తొగుల మండలం కన్గల్ గ్రామంలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లు అధికారులు గుర్తించారు. గ్రామంలోని ఓ కోళ్లఫామ్‌లో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లు అధికారులు తేల్చారు. బర్డ్ ఫ్లూతో కోళ్ల ఫామ్‌లో 15 వేల కోళ్లు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. మొన్నటిదాకా ఆంధ్రాని గడగడలాడించిన బర్డ్ ఫ్లూ వైరస్ తాజాగా తెలంగాణపై




-3 లో

# దుండిగల్ మున్సిపాలిటీలో.. రెసిడెన్షియల్ పర్మిషన్‌తో..! కమర్షియల్ కట్టడాలు..!



బౌరంపేట్ ఎస్ఆర్‌కే వెంచర్‌లో రెసిడెన్షియల్ పర్మిషన్, కమర్షియల్ నిర్మాణం..





మల్లంపేట్‌లో అక్రమ నిర్మాణం..

## మూడు వేరువేరు పర్మిషన్‌లతో.. ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్..

దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్‌లో "మల్టీప్లెక్స్" మహల్‌ను తలపించే విధంగా అక్రమ నిర్మాణంలో శరవేగంగా పనులు చేపడుతున్నారు.. మల్లంపేట్‌కి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి, సుమారు 900-1000 గజాల స్థలానికి "స్టిల్ట్ ప్లస్ 2" మూడు వేరువేరుగా రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని.. టౌన్‌ప్లానింగ్ అధికారుల సౌజన్యంతో ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నాడు.. ఎలాంటి సెట్‌బ్యాకులు లేకుండా ప్రమాదకర కట్టడాన్ని నిర్మిస్తుంటే..! టౌన్‌ప్లానింగ్ అధికారి సహకరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.. నిర్మాణం పక్కనే ఉన్న బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోకుడా అక్రమ నిర్మాణానికి సహకరించడం గమనార్హం.. చివరికి సదరు నిర్మాణంలో జిమ్ముకు మాత్రం అద్దెకు ఇవ్వకూడదని "టౌన్‌ప్లానింగ్ అధికారుల సలహాతో" ఇరువురు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం..

**లిదుండిగల్ మున్సిపల్ పట్టణ ప్రణాళికలో టిజి-బిపాస్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారు.. బరితెగింపు విధులతో అడ్డగోలుగా దండుకుంటున్నారు.. అధికారుల చేతివాటానికి ఈ అక్రమ కట్టడాలే నిదర్శనం.. మల్లంపేట్- బౌరంపేట్ పరిధిలో టౌన్‌ప్లానింగ్ నుండి ఇద్దరు చైన్‌మెన్‌లు ఫీల్డ్ సిబ్బంది ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాల విషయం, గోప్యంగా ఉంచుతున్నారని సమాచారం.. అటు టిపిఎస్ సంజునా దృష్టికి తీసుకెళ్ళినా పెద్దగా పట్టించుకోక పోవడానికి ప్రధాన కారణం ముడుపులేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించే వారి నుండి లక్షల్లో ముడుపులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. అందుకే చర్యలు పక్కనపెట్టి సహకరిస్తున్నారని విమర్శలు..లి**

-

మొదటి పేజీ తరువాయి

దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్-బౌరంపేట్‌లో అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతుంది.. పర్మిషన్‌లు మంజూరు సమయంలోనే భేరాలు కుదుర్చుకుంటారని విమర్శలు వస్తున్నాయి.. అధికారులు కూడా ఆరోపణలకు బలం చేకూర్చే విధంగానే వ్యవహరిస్తున్నారు..

"ముడుపులు ముట్టాయంటే" ఇక చర్యలు గోవిందా..! బౌరంపేట్ గ్రామ పరిధిలోని ఎస్ఆర్‌కే వెంచర్‌లో ఓ నిర్మాణ దారుడు సుమారు 1000 గజాల్లో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకున్నాడు.. అధికారులకు ఏమేరకు ముడుపులు సమర్పించుకున్నాడో ఏమో కానీ..! కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తూ, అదనంగా అక్రమ సెల్లార్ నిర్మించారని, పెన్ పవర్ దినపత్రికలో వార్తా కథనంతో..! టౌన్‌ప్లానింగ్ అధికారి సంజునా దృష్టికి తీసుకెళ్ళినా చర్యలు మాత్రం తీసుకోలేదు..



బౌరంపేట్ సింహపురి కాలనీలో అక్రమ నిర్మాణం..



మల్లంపేట్‌లో అక్రమ నిర్మాణం..

## బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులో..

దుండిగల్ మున్సిపల్ బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులో ఓ నిర్మాణదారుడు సర్వే నెంబర్ 541, 542, 544, 545, 547, 548, 554, 555, 560లో ప్లాట్ నెంబర్ 858ఎ, 859ఎ సుమారు 940 గజాల స్థలానికి "2023 మే 30న" టిజి-బిపాస్ చట్టం ద్వారా రెసిడెన్షియల్ అనుమతులు తీసుకునాడు. 004339/BP/DTCP/3144/0020/2023 ప్రకారం, "సెల్లార్, గ్రౌండ్ ం 4 అంతస్తులకు" అనుమతులు పొందాడు.. భవనం చుట్టూ నాలుగు వైపులా "4 మీటర్లు (సుమారు 13 ఫీట్లు) సెట్‌బ్యాకులు" ఉండాలి.. ఎలాంటి కమర్షియల్ నిర్మాణం చేపట్టకూడదు.. అయినప్పటికీ సంబంధిత నిర్మాణదారుడు సెట్‌బ్యాకులు కుదిస్తూ, ఒకవైపు సెట్‌బ్యాకు స్థలంలో వాచ్‌మెన్ రూమ్ నిర్మాణం, సెల్లార్‌కి వెళ్ళడానికి దారితో పాటు షెడ్డును నిర్మించాడు.. సంబంధిత అక్రమ కట్టడానికి మున్సిపల్ అధికారులు, దక్షిణ పుచ్చుకుని లక్షణంగా "ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" జారీచేయడం గమనార్హం.. మరోవైపు అదే రెసిడెన్షియల్ భవనంలో కమర్షియల్ కార్యకలాపాలు ప్రారంభించారు "నారాయణ పాఠశాల"కు అద్దెకు ఇచ్చారు..! మున్సిపల్ అధికారులు మన్నుతిన్న పాములా చర్యలకు దూరంగా ఉంటున్నారు.. బహుశా టౌన్‌ప్లానింగ్ అధికారులకు భారీగా ముడుపులు ముట్టాయని గుసగుస..

# కంచ గచ్చిబౌలి భూములపై ఏఐ ఫొటోలు, వీడియోలు డిలీట్

- మొదటి పేజి తరువాయి

ప్లాట్ ఫామ్స్ లో ఫొటోలు షేర్ అయ్యాయి. ఈ వీడియోలు, ఫొటోలను ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి, ప్రధాని నరేంద్ర మోదీకి ట్యాగ్ చేశారు. హెచ్?సీయూ భూములు కాపాడాలని సినిమా తారలు కూడా పోస్టులు పెట్టారు. అందరూ దాదాపుగా అదే ఫొటోనూ వాడారు. కొన్ని పత్రికలు కూడా ఆ ఫొటోను పతాక శీర్షికన ప్రచురించాయి. సీన్ కట్ చేస్తే అది ఫేక్ ఫొటో..! దానిని ఏఐ క్రియేట్ చేసింది.

బుల్డోజర్లు, పక్కనే ఎగురుతున్న నెమ్మళ్లు.. సమీపంలో ఉన్న జింకలు అంతా ఏఐ క్రియేషనే. దీనిని సీరియస్?గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ ఫొటోలను షేర్ చేసిన బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగానికి చెందిన మన్నె క్రిశాంక్, దిలీప్ కొణతంకు నోటీసులు జారీ చేసింది. ఎవరెవరు ఈ ఫొటోలను షేర్ చేశారు.. ఎవరు క్రియేట్ చేశారనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదే సమయంలో ఫేక్ వీడియోల వ్యాప్తికి పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం హైకోర్టులో కేసు వేసింది. దీంతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తన ట్విట్టర్ హ్యాండిల్ లో షేర్ చేసిన ఈ ఫొటోలను డిలీట్ చేయడం విశేషం.

**అలర్ట్.. డిలీట్**

రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించడంతో నాయకులు, సోషల్ మీడియా వారియర్లు అలర్ట్ అయ్యారు. సాక్షాత్తూ కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి తాను ట్విట్టర్ హ్యాండిల్ లో పోస్టు చేసిన ఏఐ క్రియేటెడ్ ఫొటోను డిలీట్ చేశారు. అలాగే రాష్ట్ర మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి కూడా ఆ ఫొటోలను డిలీట్ చేశారు. బీఆర్ఎస్ ట్విట్టర్ హ్యాండిల్ లోనూ ఈ ఫొటోలు మాయమవడం గమనార్హం. ఓ జింక కళేబరం పడి ఉన్న ఫొటో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. ఆ ఫొటో కూడా నకిలీదని సైబర్ క్రైం అధికారుల విచారణలో తేలింది. అందులో జింక కాళ్లు కట్టేసి ఉన్నాయని, అది ఎక్కడో వేటాడిన జింక అని పేర్కొన్నారు. దానికి, కంచ గచ్చిబౌలి భూములకూ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ పొటోనూ బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ పోస్టు చేశారు. అదే ఫొటోను పొరపాటున పోస్ట్ చేశానని, క్షమించాలంటూ జర్నలిస్ట్ సుమిత్ ఝా 'ఎక్స్'లో చేసిన పోస్ట్‌ను కూడా సైబర్ క్రైం అధికారులు విడుదల చేశారు.

**హెచ్‌సీయూ భూమిలోకి ఏనుగులు!!**

సోషల్ మీడియా హ్యాండిల్స్ లో హెచ్సీ యూ భూముల్లో ఏకంగా ఏనుగులే ఉన్నట్టు కొన్ని వీడియోలు సర్క్యులేట్ అయ్యాయి. ఉమంగ్ జైన్ పేరుతో ఉన్న ట్విట్టర్ హ్యాండిల్ లో ఏకంగా తీవ్రంగా గాయపడ్డ ఏనుగు ఫొటోనే పోస్టు చేయడం విశేషం. అడ్వొకేట్ జానీ వర్మ పేరుతో ఉన్న హ్యాండిల్ లో ఏకంగా ఓ ఏనుగుల గుంపే వెళ్తున్న వీడియో పోస్ట్ అయ్యింది.

**ఫేక్ కాదు.. నిజమైనవే: దియా మీర్జా**

ఇదే కేసులో సినీనటి దియామీర్జా, యూట్యూబర్ ధ్రువ్ రాఠీ ఏఐ జనరేటెడ్ ఫొటోలను షేర్ చేసినట్టు సీఎంవో చెబుతోంది. వారినైనా చర్యలు తీసుకోవాలని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ లో కోరింది. బాలీవుడ్ నటీమణి దియా మీర్జా నటీమణి ఈ వివాదంపై స్పందించారు. తాను ఎలాంటి నకిలీ వీడియోలు, ఫొటోలు షేర్ చేయలేదని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

**ట్రెండింగ్ హ్యాష్ ట్యాగ్స్**

సోషల్ మీడియాలో SaveHCU, #SaveHCUBioDiversity, #HCU, #SaveKanchaGachibowli హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్ అయ్యాయి. ఈ హ్యాష్ ట్యాగ్స్ తో ఏఐ జనరేటెడ్ ఫొటోలు, వీడియోలు షేర్ చేసినట్టు సైబర్ క్రైం అధికారులు గుర్తించారు.

# సిద్దిపేట జిల్లాలో బర్డ్ ఫ్లూ నిర్ధారణ.. 15 వేల కోళ్లు చచ్చిపోయినయ్..!

- మొదటి పేజి తరువాయి

పంజా విసిరింది.రెండు నెలలుగా యాదాద్రి భువనగిరి, నల్గొండ, తదితర జిల్లాల్లో పెద్ద ఎత్తున కోళ్లు బర్డ్ ఫ్లూతో చనిపోగా.. ఇటీవల రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్?మెట్ మండలం బాట సింగారంలోని ఓ పౌల్ట్రీ ఫామ్?లో వేల సంఖ్యలో కోళ్లు చనిపోయాయి. అధికారులు కోళ్ల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు చేయించగా బర్డ్ ఫ్లూ అని తేలింది.రంగారెడ్డి జిల్లా బాట సింగారంలోని పౌల్ట్రీ ఫామ్‌లో బర్డ్ ఫ్లూ సోకడంతో వేల సంఖ్యలో కోళ్లు చనిపోయాయి. ఆ కోళ్లను పరిశీలించిన అధికారులు శాంపిల్స్‌ని భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్(ఎన్ఐహెచ్ఎస్ఏడీ)కు పంపించారు. ఆ కోళ్లకు హెచ్5ఎన్1 వైరస్ సోకిందని సైంటిస్టులు ధ్రువీకరించారు. దీంతో సదరు పౌల్ట్రీ ఫామ్?లోని దాదాపు 10 వేల కోళ్లను చంపేసి జేసీబీ సాయంతో పూడ్చిపెట్టారు. ఆ ఫామ్?ను సీజ్ చేయడంతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలో కోళ్లు, గుడ్లు అమ్మకుండా నిషేధం విధించారు.బర్డ్ ఫ్లూ ప్రధానంగా కోళ్లు, పక్షుల మధ్య వ్యాపిస్తుంది. వ్యాధి సంక్రమించిన కోళ్లు, పక్షుల మలం, లాలాజలం, మ్యూకస్ ద్వారా వ్యాప్తి చెందుతుంది. వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో పౌల్ట్రీ పరిశ్రమలో పని చేసే వారికి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కోడి, బాతు, పావురాల వంటి పక్షులకు దగ్గరగా ఉండే వ్యక్తులకు అధిక ముప్పు ఉంటుంది. అయితే, వేడితోకూడిన

పొడి వాతావరణంలో వైరస్ ఎక్కువసేపు బతకలేదని.. చల్లని, తడి వాతావరణంలోనే దీర్ఘకాలం సజీవంగా ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. ఇక బర్డ్ ఫ్లూ సోకిన వ్యక్తుల్లో కనిపించే ముఖ్యమైన లక్షణాలు తీవ్రమైన జ్వరం, గొంతు నొప్పి, శ్వాసకోశ సమస్యలు, కళ్లలో ఇన్?ఫెక్షన్, వాంతులు, విరేచనాలు ఉంటాయి. సాధారణ ఫ్లూ లక్షణాలతో పోలిస్తే తీవ్రమైన ప్రభావం ఉంటుంది. బర్డ్ ఫ్లూ బారిన పడి చనిపోయిన కోళ్లను తాకడం, పచ్చి కోడిమాంసం తినడం ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు. అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. చికెన్?ను కనీసం 70 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో వండుకుంటేనే బర్డ్ ఫ్లూ వైరస్ చనిపోతుందని చెప్పారు. వీలైనంత వరకు బయటి ఆహార పదార్థాలు తినకుండా ఉండడం మేలని సలహా ఇస్తున్నారు.

## ఏడో తరగతి విద్యార్థుల స్కూల్ బ్యాగుల్లో కండోమ్స్.. సోషల్ మీడియాలో వీడియో వైరల్ !



**హైదరాబాద్ పెన్ పవర్:** మహారాష్ట్రలోని నాసిక్?లో ఉన్న ఒక స్కూల్?లో విద్యార్థుల స్కూల్ బ్యాగులను తనిఖీ చేయగా కండోమ్స్, కత్తులు కనిపించాయి. ఏడవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థుల స్కూల్ బ్యాగ్స్?లో కండోమ్ ప్యాకెట్లు, కత్తులు, ప్లేయింగ్ కార్డ్స్ కనిపించడంతో స్కూల్ యాజమాన్యం విస్తుపోయింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.సదరు స్కూల్ వైస్ ప్రిన్సిపాల్.. విద్యార్థుల బ్యాగులు తనిఖీ చేయాలని సిబ్బందికి చెప్పారు. స్కూల్ సిబ్బంది తనిఖీ చేయగా ఈ షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. కొందరు విద్యార్థుల్లో క్రిమినల్ మనస్తత్వం పెరగడం ఆందోళన కలిగించిందని, ఇకపై ప్రతీ రోజు పిల్లల స్కూల్ బ్యాగ్స్ చెక్ చేస్తామని వైస్ ప్రిన్సిపాల్ చెప్పుకొచ్చారు.నాసిక్ జిల్లాలోని ఘోటిలో ఉన్న ఒక స్కూల్?లో ఈ ఉదంతం వెలుగుచూసింది. ఇవి మాత్రమే కాదు.. కొందరు విద్యార్థుల బ్యాగుల్లో డ్రగ్స్ కూడా దొరకడంతో స్కూల్ యాజమాన్యానికి ఫ్యూజులు ఎగిరిపోయినంత పనైంది. ఇది.. కేవలం తనిఖీలతో చేతులు దులుపుకునే విషయం కాదని పోలీసులకు స్కూల్ మేనేజ్ మెంట్ రిపోర్ట్ చేసింది. పోలీసులు ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.

## వాలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులు కాదు.. ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం లేదు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని.. గౌరవ వేతనం రూ. 10 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే.. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా వలంటీర్ల కొనసాగింపు ఎలాంటి ఊసు లేకపోగా.. సీఎం చంద్రబాబు సహా మంత్రి లోకేష్ వంటి కీలక నేతలు వాలంటీర్ వ్యవస్థ కొనసాగించేది లేదంటూ తేల్చి చెబుతున్నారు. దీంతో పలు మార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు వాలంటీర్లు. తాజాగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వాలంటీర్లను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. వాలంటీర్లను కొనసాగిస్తామని చెప్పామని.. కానీ వాలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులు అన్నట్లు ఎలాంటి జీవో లేదని అన్నారు. మంగళవారం ( ఏప్రిల్ 8 ) అల్లూరి జిల్లా పర్యటనలో మాట్లాడుతూ ఈమేరకు వ్యాఖ్యలు చేశారు పవన్ కళ్యాణ్. ప్రభుత్వానికి సంబంధం లేకుండా వాలంటీర్ వ్యవస్థను నడిపారని వైసీపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు పవన్. అసలు వాలంటీర్ వ్యవస్థ ఉన్నట్లు అధికారికంగా ఎలాంటి దాఖలాలు లేవని అన్నారు. గత ప్రభుత్వం వాలంటీర్లను మభ్యపెట్టిందని అన్నారు. వాలంటీర్ వ్యవస్థను తిరిగి తీసుకొద్దామంటే అధికారికంగా ఎలాంటి ఆప్షన్ లేకుండా చేశారని అన్నారు పవన్ కళ్యాణ్. కాగా.. పవన్ అల్లూరి జిల్లా పర్యటనలో ఉండగా.. సింగపూర్ లో చదువుతున్న తన కుమారుడు మార్క్ శంకర్ పావనోవిచ్ అగ్నిప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో హుటాహుటిన విశాఖ ఎయిర్పోర్ట్ నుండి సింగపూర్ బయలుదేరారు పవన్. మంగళవారం ( ఏప్రిల్ 8 ) పావనోవిచ్ చదువుతున్న స్కూల్ లో అగ్నిప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో దట్టమైన పొగ కారణంగా పావనోవిచ్ కి బ్రీతింగ్ ప్రాబ్లమ్ వచ్చినట్లు సమాచారం.

## ఏపీలో ఒకప్పటి బీహార్ కంటే దారుణమైన పరిస్థితులు.. రెడ్ బుక్ పాలన నడుస్తోంది..

**హైదరాబాద్ పెన్ పవర్:**సత్యసాయి జిల్లా పాపిరెడ్డిపల్లిలో పర్యటించిన వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వాన్ని ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. లింగమయ్య హత్య రాష్ట్రంలో పరిస్థితులకు అద్దం పడుతోందని.. రాష్ట్రంలో ఒకప్పటి బీహార్ కంటే దారుణమైన పరిస్థితులు ఉన్నాయని.. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగుతోందని అన్నారు జగన్. 50 చోట్ల ఎంపీపీ ఎన్నికలు జరిగితే.. 39 చోట్ల వైసీపీ గెలిచిందని.. టీడీపీకి బలం లేకున్నా గెలవాలని చూసి 7 చోట్ల వాయిదా వేయించాలని చూశారని అన్నారు. చంద్రబాబు ప్రలోభాలు పెట్టి, భయపెట్టే ప్రయత్నం చేశారని.. 8 మంది ఎంపీటీసీలతో ఎస్ఐ సుధాకర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్యే కొడుక్కి ఫోన్ చేయించారని అన్నారు.వీడియా కాల్లో భాగ్యమ్మ అనే ఎంపీటీసీని బెదిరించారని.. పెనుకొండలో వైసీపీ ఎంపీటీసీలను కిడ్నాప్ చేసే ప్రయత్నం చేశారని.. వాళ్ళను తీసుకెళ్ళినందుకే ప్రకాష్ రెడ్డి, ఉషశ్రీలపై కేసు పెట్టారని అన్నారు. ఎన్నికల్లో గెలవకపోవడంతో భయం క్రియేట్ చేయాలని చూశారని అన్నారు జగన్. లింగమయ్య హత్య ఘటనలో 20మంది అటాక్ చేస్తే, ఇద్దరి మీద మాత్రమే కేసు పెట్టారని మండిపడ్డారు. ఎమ్మెల్యే బంధువులు, ఎమ్మెల్యే కొడుకు మీద ఎందుకు కేసులు పెట్టలేదని అన్నారు. ఎంపీటీసీలను ప్రలోభపెట్టిన రామగిరి ఎస్ఐపై కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు జగన్. లింగమయ్య భార్యతో బలవంతంగా వేలిముద్ర వేయించారని.. టీడీపీ వారినే సాక్షులుగా ఇందులో చేర్చారని అన్నారు జగన్.

# ఇండియన్ విద్యార్థులకు ట్రంప్ షాక్స్.. స్పీడ్ డ్రైవింగ్ చేసినందుకు వీసా క్యాన్సిల్..!




**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎంట్రీ నాటి నుంచి భారతీయ విద్యార్థులతో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు అమెరికాలో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఏ రోజు తమ వీసాలు క్యాన్సిల్ చేస్తారో అనే భయం వారిని వెంటాడుతూనే ఉంది. ఇటీవల చాలా మంది యూనివర్సిటీ విద్యార్థులకు అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు సెల్ఫ్ డిపోర్టేషన్ అవ్వాలంటూ మెయిల్స్ పంపిన సంగతి తెలిసిందే. గడచిన కొన్ని రోజులు అమెరికాలోని డజన్ల మంది భారతీయ విద్యార్థుల ఎఫ్-1 వీసాలను అధికారులు తిరస్కరిస్తున్నారు. వారు చేసిన చిన్న తప్పులను కారణాలుగా చూపుతూ సెల్ఫ్ డిపోర్టేషన్ కావాలంటున్నారు. దీంతో అమెరికాలోని మిస్సోరీ, టెక్సాస్, నెబ్రాస్కా విశ్వవిద్యాలయాల్లోని స్టూడెంట్స్ ప్రభావితం అయ్యారు. దీనికి ముందు గతవారం అధికారులు కాలేజీల్లో చేపట్టిన కొన్ని నినాదాలకు సపోర్ట్ చేసినందుకు ఇలాంటి మెయిల్స్ అందుకున్నారు. ట్రాఫిక్స్ రూల్స్ పాటించనందుకు, ఓవర్ స్పీడింగ్, లైసెన్స్ సూపర్వైజర్ లేకుండా లెర్నర్స్ పర్మిట్ పై కారు నడిపటం వంటి చిన్న తప్పులకు సైతం విద్యార్థుల వీసాలను అమెరికాలోని అధికారులు క్యాన్సిల్ చేయటం ఆందోళనకర పరిస్థితులకు దారితీస్తోంది. డిజైన్డ్ స్కూల్ అఫీషియల్స్ చాలా మంది విద్యార్థుల పేర్లను విద్యార్థి అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ సమాచార వ్యవస్థ నుంచి తొలగించినట్లు మెయిల్స్ పంపటం కలకలం రేపింది. దీంతో వారు అమెరికాలో నివసించటం చట్టరీత్యా కుదరదు. సదరు విద్యార్థుల వీసా నిరాకరణకు గురైనందున వారు తిరిగి స్వదేశానికి వెళ్లిపోవాల్సి ఉంటుంది.

ప్రస్తుతం అమెరికాలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద జంప్ అయిన చిన్న కేసుల వల్ల కూడా వీసా కోల్పోయిన భారతీయ విద్యార్థులు చాలా మంది తనను సంప్రదిస్తున్నారని టెక్సాలోని ఒక లాయర్ వెల్లడించారు. సుమారు 30 వరకు ఇలాంటి కేసులను తాను చూస్తున్నట్లు పేర్కొన్నారు. పైగా ఇండియాకు చెందిన విద్యార్థుల నుంచి ఎక్కువగా ఇలాంటి కేసులు తన వద్దకు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. వీరిలో చాలా మంది దాదాపు ఏడాది కింద అవి జరిగాయని ఇప్పటివి కాదని చెబుతున్నారు. ఒక విద్యార్థి వాల్ మార్ట్ నుంచి సరకులు దొంగించిన కేసులో క్లీన్ చిట్ వచ్చినప్పటికీ ప్రస్తుతం డిపోర్టేషన్ కి గురైనట్లు వెల్లడైంది. ఈ క్రమంలో యూనివర్సిటీలు సైతం విద్యార్థులను వెంటనే లీగల్ హెల్ప్ తీసుకుని ముందుకు సాగాలని సూచిస్తున్నారు. ఇలా అయి తే అమెరికా కల కష్టమేనని చాలా మంది భారతీయ యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భర్త రైల్వే ఉద్యోగం కోసం.. నిద్ర మాత్రలు వేసి.. గొంతు పిసికి చంపిన భార్య



**హైదరాబాద్ పెన్ పవర్:**యూపీలో మరో దారుణం..మాజీ మర్చంట్ నేవీ అధికారి సుభాష్ రాజ్ పుత్ హత్యను మర్చిపోకముందే..అదే తరహాలో మరో హత్య..యూపీలోని బిజ్నూర్ లో ఉద్యోగం కోసం భర్తను కడతేర్చింది ఓ భార్య.. తినే పదార్థాల్లో మత్తు మందు కలిపి దారుణానికి వడికట్టింది. ఏమీ తెలియనట్టు హార్ట్ అటాక్ తో చనిపోయాడని నమ్మించేందుకు ప్రయత్నించింది. అయితే నిజం దాగలేదు..పోలీసుల విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. ఉద్యోగం కోసం భర్తను దారుణంగా హత్య చేసిన ఘటన ఉత్తరప్రదేశ్ లోని బీజ్నూర్ లో చోటు చేసుకుంది. ఈ హత్య వెనక వివాహేతర సంబంధం మరో కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్ లోని బిజ్నోర్‌లో సమీపంలో ముక్రందపూర్ గ్రామానికి చెందిన దీపక్ నజీబాబాద్‌లోని ఆదర్శ్ నగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. రైల్వే ఉద్యోగి.. మాజీ సీఆర్ పీఎఫ్ జవాన్..అతను గత జూన్ 17న చౌహర్‌పూర్ నహ్టౌర్‌కు చెందిన శివానీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఆరు నెలల కుమారుడు కూడా ఉన్నాడు. శ్రీరామనవమి(ఏప్రిల్6) రోజున దీపక్ కుమార్ తన నివాసంలో పూజ చేస్తూ హార్ట్ అటాక్ కు గురయ్యాడు.. దీంతో దీపక్ ను చికిత్స ఆస్పత్రికి తరలించారు.అప్పటికే దీపక్ చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు.దీంతో అయితే దీపక్ హార్ట్ అటాక్ తో చనిపోలేదని..అతని మృతిపై అనుమానాలున్నాయని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు దీపక్ భార్య శివానిని విచారించగా షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీపక్ కుటుంబ సభ్యులు అనుమానించినట్లుగానే శివాని అతనిని హత్య చేసినట్లు ఒప్పుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామనవమి రోజున దీపక్ కు తినే పదార్థాల్లో స్లీపింగ్ టాబ్లెట్లు కలిపి ఇచ్చింది. దీంతో అతను అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇదే అదనుగా శివాని భర్త ను మట్టుబెట్టింది. ఏమీ తెలియనట్లు భర్తకు హార్ట్ అటాక్ వచ్చి పడిపోయాడు..ఆస్పత్రికి తీసుకెళ్ళాను..అప్పటికే చనిపోయాడని దీపక్ కుటుంబ సభ్యులను నమ్మించేందుకు యత్నించింది. దీపక్ మృతిపై అతని బావకు అనుమానం వచ్చి పోస్ట్ మార్టం చేయాలని పట్టుబట్టారు. పోస్ట్?మార్టమ్ రిపోర్టులో సంచలన విషయాలు తెలిశాయి. దీపక్ చనిపోయింది హార్ట్ అటాక్ తో కాదు..గొంతు నులిమి చంపారని వెల్లడైంది. అయితే దీపక్ ను చంపేందుకు శివానికి మరొక వ్యక్తి సహకరించి ఉంటారని కుటుంబసభ్యులు, పోలీసులు అనుమానం వ్యక్త చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

మార్చి 2023లో రైల్వేలో చేరిన దీపక్ గతంలో మణిపూర్‌లోని %CRPF%లో పనిచేశారు. అతను పారామిలిటరీ దళాన్ని విడిచిపెట్టి తన కుటుంబంతో స్థిరపడ్డాడు. అయితే దీపక్ కొత్త జీవితం ప్రారంభించిన ఒక సంవత్సరంలోనే అతని జీవితం అకస్మాత్తుగా ముగిసింది. దీపక్ దారుణ హత్య, చిన్న బిడ్డను వదిలివెళ్లడంతో అతని కుటుంబ సభ్యులు దుఖంలో మునిగిపోయారు. నెలరోజుల్లో యూపీలో జరిగిన భార్య చేతిలో హతమైన భర్త కేసుల్లో దీపక్ హత్య రెండోది.

# ఈ ఏడాదిలోనే కేజీ వెండి రేటు రూ.2 లక్షలకు చేరుతుందా..? సీక్రెట్ రివీల్డ్..



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రస్తుతం గడచిన ఏడాది కాలం నుంచి బంగారం కంటే వెండి ధరలు వేగంగా పెరగటం మనం చూస్తూనే ఉన్నాం. గత ఏడాది వెండి కేజీ ధర రిటైల్ మార్కెట్లలో దాదాపు రూ.లక్షకు పైకి చేరుకుని కొనసాగుతోంది. చాలా కాలంగా బంగారం వైపు మ్మొగ్గు చూపిన ప్రజలు ప్రస్తుతం వెండి వెనుక పడటంతో చాపకింద నీరులా దాని రేట్లు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి వెండి ధరల గురించి ఆసక్తికరమైన అంశాలను పంచుకున్నారు. కియోసాకి ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల మందిని తన పుస్తకం ద్వారా ఆర్థికపరమైన అంశాలు, పెట్టుబడుల గురించి ఎడ్యుకేట్ చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజలు వివిధ పెట్టుబడి ఎంపికల్లో ఎలా తమ డబ్బును పొదుపు చేసుకోవచ్చనే అంశాలపై కియోసాకీ పుస్తకం ప్రజలకు అవగాహన కల్పించింది. ఎల్లప్పుడూ కియోసాకి వెండి బంగారంలను నిజమైన ఆస్తులుగా పేర్కొంటుంటారు. పైగా వీటిని భౌతిక రూపంలో కలిగి ఉండటం ఉత్తమమని ఆయన చెబుతుంటారు. ఈ క్రమంలోనే 2025లో వెండి రేటు కేజీకి రూ.2 లక్షలకు చేరుకోవచ్చని తన తాజా అంచనాలను పంచుకున్నారు.

కియోసాకీ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఔన్సు వెండి ధర ప్రస్తుతం 34 డాలర్ల వద్ద ఉంది. అయితే దీని రేటు ఈ ఏడాది చివరి నాటికి 70 డాలర్లకు చేరుకోవచ్చని ఆయన చెబుతున్నారు. అంటే భారత కరెన్సీ లెక్కల ప్రకారం కేజీ రేటు ప్రస్తుతం 34 డాలర్ల ఔన్సు లెక్కల ప్రకారం రూ.90 వేల నుంచి పెరిగి ఔన్సుకు 70 డాలర్లకు చేరితే రూ.2 లక్షల మార్కును క్రాస్ చేస్తుందని ఆయన వెల్లడించారు. చారిత్రాత్మకంగా ప్రభుత్వాలు వెండి ధరలను తారుమారు చేస్తూ వచ్చాయని, పరిశ్రమలకు దానిని అందుబాటు ధరలో ఉంచేందుకు రేట్లు పెరగకుండా తొక్కిపెట్టి ఉంచినట్లు కియోసాకి అభిప్రాయపడ్డారు.

అందుకే తాను మరింత వెండిని కొనుగోలు చేస్తున్నానని కియోసాకి పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా

ప్రజలు వెండిని కొనటానికి ధనవంతులే కావాల్సిన అవసరం లేదని, తక్కువ డబ్బు ఉన్న వ్యక్తులు కూడా ఔన్సు వెండిని సులువుగా కొనుగోలు చేయగలరని ఆయన అన్నారు. వాస్తవానికి బంగారం, వెండి, బిట్ కాయిన్ రేట్లు పెరగటం లేదని అమెరికా డాలర్ విలువను కోల్పోతోందని కియోసాకి అభిప్రాయపడ్డారు. అందుకే ప్రజలు విలువలేని పేపర్ కరెన్సీని దాచుకోవటానికి బదులుగా వెండిని కొనుగోలు చేయాలని సూచించారు. ఆర్థిక వ్యవస్థల అస్థిరతల నుంచి ప్రజలు తమ సంపదను కాపాడుకోవటానికి బంగారం, వెండి, బిట్ కాయిన్ వంటి వాటిలో ఆలస్యం కాకమునుపే పెట్టుబడులు పెట్టాలని సూచించారు.

### వెండి బంగారం కంటే ఎందుకు ఎక్కువ విలువైనది..?

వాస్తవానికి చాలా మంది బంగారం వెండి కంటే ప్రియమైనదిగా పేర్కొంటుంటారు. కానీ కియోసాకీ మాత్రం వెండిపై ఎక్కువ మక్కువ చూపటానికి గల కారణాలను పంచుకున్నారు. ముఖ్యంగా వెండిని.. సోలార్ ప్యానెల్స్, ఎలక్ట్రానిక్ వాహనాలు, కంప్యూటర్లతో పాటు అనేక ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీలో వినియోగించటం దాని డిమాండ్ రోజురోజుకూ పెంచుతోందని ఆయన అన్నారు. అలాగే ఆయుధాలు, ఆధునిక మెడికల్ అప్లయెన్సెస్, వాటర్ ప్యూరిఫికేషన్ టెక్నాలజీల్లో దీని వినియోగం పెరిగిందని వెల్లడించారు. ఇలా వెండికి పెరుగుతున్న పారిశ్రామిక వినియోగ డిమాండ్ ధరలను పెంచగలదని కియోసాకీ అభిప్రాయం వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ సభకు అడ్డంకులు పెడుతున్న ప్రభుత్వం

**హైదరాబాద్ పెన్ పవర్:** వరంగల్ వేదికగా ఈనెల 27న తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను తలుచుకుని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వణుకు మొదలైందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. వరంగల్ సభను అడ్డుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటినుండే అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించిన ఆమె.... ప్రభుత్వం ఎన్ని అవాంతరాలు సృష్టించినా సరే 10 లక్షల మందితో వరంగల్ సభను నిర్వహిస్తామని ప్రకటించారు. మరోవైపు రంగారెడ్డి జిల్లా నుండి లక్షన్నర మంది గులాబీ సైనికులను వరంగల్ సభకు తరలిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రకటించారు.

ఏప్రిల్ 27న వరంగల్ లో తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో హైదరాబాద్ శివారులోని శంషాబాద్ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సుధీర్ రెడ్డి, పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సబితా ఇంద్రారెడ్డి.... ఏడాది కాంగ్రెస్ పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోయారని, కేసీఆర్ ను మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. వరంగల్ వేదికగా తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా గులాబీ సైనికులు తరలిరానున్నారని, దీంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వెన్నులో వణుకు మొదలైందని చెప్పారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించిన సరే వరంగల్ సభ ను జయప్రదం చేస్తామని ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా నుండి కనీసం లక్షన్నర మందిని తరలించాలి లక్ష్యంగా పెట్టుకున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రకటించారు.

# తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై సుప్రీంకోర్టు సీరియస్

**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై సుప్రీంకోర్టు సీరియస్ అయ్యింది. రాష్ట్ర అసెంబ్లీ పంపిన బిల్లులను తన వద్దే పెట్టుకునే వీటో అధికారం గవర్నర్‌కు లేదని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దివాలా, ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఇవాళ తీర్పు వెలువరించింది. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి చర్యలు అక్రమం అని పేర్కొన్న కోర్టు.. ఆయన వద్ద పెండింగ్‌లో ఉన్న 10 బిల్లులకు క్లియరెన్స్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర శాసనసభ నుంచి వచ్చిన బిల్లులకు గవర్నర్ తప్పనిసరిగా అనుమతి ఇవ్వాలని, అయితే బిల్లులో వైరుధ్యం ఉంటే దాన్ని తిరస్కరించాలని కోర్టు పేర్కొన్నది. తమిళనాడు శాసనసభ పంపిన పది బిల్లులను గవర్నర్ రిజర్వ్‌లో పెట్టుకోవడం అక్రమం అని, న్యాయ వ్యతిరేకమైందని, అందుకే ఆ చర్యలను పక్కన పెడుతున్నామని, ఆ బిల్లులను గవర్నర్‌కు సమర్పించిన నాటి నుంచి వాటికి క్లియరెన్స్ దక్కినట్లు కోర్టు ప్రకటించింది. తమ బిల్లులకు గవర్నర్ అనుమతి ఇవ్వడం లేదని తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషన్‌పై కోర్టు తాజా ఆదేశాలు జారీ చేసింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో గవర్నర్ల చాలా చురుకుగా పనిచేయాలని కోర్టు పేర్కొన్నది. ఓ స్నేహితుడిగా, మార్గదర్శిగా, తత్వవేత్తగా గవర్నర్ పనిచేయాలని కోర్టు సూచించింది. రాజకీయ ప్రేరణతో ఆయన పనిచేయరాదు అని ధర్మాసనం తెలిపింది. సమస్యలు పరిష్కరించడంలో గవర్నర్ ఓ దూతలా ఉండాలని, ఓ ఉత్ప్రేరకంగా పనిచేయాలని కోర్టు చెప్పింది. రాజ్యాంగ విలువల్ని గవర్నర్లు రక్షించాలని కోర్టు తెలిపింది. 2020 నుంచి 2023 వరకు సుమారు 12 బిల్లలను తమిళనాడు అసెంబ్లీ.. గవర్నర్ అనుమతి కోసం పంపింది. కానీ గవర్నర్ ఆ బిల్లులను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో ఆ బిల్లుల అనుమతి కోరుతూ తమిళనాడు సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

## ఆరోగ్య అవగాహనపై 2 కె రన్

**హైదరాబాద్ పెన్ పవర్:** మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్య జీవనం గడపవచ్చునని కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కాకినాడ సూర్య గ్లోబల్, టీమ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హాస్పటల్ నుండి నాగమల్లి తోట జంక్షన్ వరకు ఆరోగ్య అవగాహన పై 2 కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ మాట్లాడుతూ ప్రతి మనిషి చిన్న వయసు నుండి ప్రతిరోజూ వ్యాయామం, పోషకాలు కలిగిన సంప్రదాయ ఆహారం తీసుకోవాలని అన్నారు. సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్,హాస్పటల్ చైర్మన్ డాక్టర్ %దీప్తూ.నా%.వీర్రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలంటే పోషకాలతో కూడిన ఆహారం,వ్యాయామం దినచర్యలో భాగం కావాలని పిలుపునిచ్చారు.ఇంటి పునాది గట్టిగా ఉంటేనే ఇల్లు ఎక్కువ రోజులు దృఢంగా ఉండగలదని అదే రీతిలో ప్రతి మనిషి చిన్న వయసు నుండి అనగా పుట్టిన నాటి నుండి పౌష్టిక ఆహారం తింటూ సమయానికి రక్షణ టీకాలు వేయించుకుంటూ భవితవ్యాన్ని బలపరుచుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డా.అడ్డాల సత్యనారాయణ, డా.చప్పిడి వెంకటేశ్వరరావు,హాస్పటల్ వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు,సిబ్బంది పాల్గొన్నారు..

## జనసేన నాయకుడు ఉమ పై దాడి చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకుంటాం..

**హైదరాబాద్ పెన్ పవర్:**అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం అధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్ దాడిలో గాయపడిన తోలేటి ఉమాను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించారు. జనసేన నాయకుడు ఉమ పై దాడి చేసిన మండల అధ్యక్షుడుపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం. ఎవరు తప్పు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. జనసేన నాయకుడిపై దాడి చేసిన మండల అధ్యక్షుడు పై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యేలును అయినవిల్లి మండల జనసేన నాయకులు నిలదీసారు. పార్టీ నాయకుడిపై దాడి చేసిన మండల అధ్యక్షుడిని వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేయాలంటూ ఎమ్మెల్యేను నిలదీసారు. పోలిశెట్టి రాజేష్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోతే అయిన వెళ్లిన జనసేన నేతలంతా పార్టీని వీడేందుకు సిద్ధం అంటున్నారు.

## సంగంబండ రిజర్వాయర్ లో మొసలి హల్ చల్

**హైదరాబాద్ పెన్ పవర్:**నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లో ఓ మొసలి కలకలం రేపింది. మంగళవారం మొసలి డ్యాం నుండి బయటికి రావడంతో ఆందోళనకు గురైన గ్రామస్తులు మొసలిని బంధించ ఆరు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో ఫారెస్ట్ అధికారులు సంఘంబండ డ్యాం దగ్గరికి చేరుకొని బంధించిన మొసలినిని స్వాధీనం చేసుకున్నారు. తరువాత దానిని తీసుకెళ్లి క్రిష్ణా నదిలోకి వదిలేయడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

## పేదలందరికీ పూర్తి స్థాయిలో ఆహార భద్రత కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**భూపాలపల్లి పట్టణం, 8 ఏప్రిల్ పెన్ పవర్:** పేదలందరికీ పూర్తి స్థాయిలో ఆహార భద్రత కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు అన్నారు. ఈరోజు మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీకి చెందిన ఎస్టీ లంబాడా సామాజిక వర్గానికి చెందిన బానోత్ రాజేందర్ – మౌనిక నాయక్ దంపతుల ఇంట్లో ప్రభుత్వం అందించిన సన్నబియ్యంతో వండిన భోజనాన్ని వారి కుటుంబ సభ్యులు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గారితో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు నేలపై కూర్చుని భోజనం చేశారు. అంతకుముందు రాజేందర్ కుటుంబ సభ్యుల యోగక్షేమాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. సన్నబి య్యం పంపిణీ తో పేదవారి కళ్ళలో ఆనందాన్ని స్వయంగా చూశానని ఎమ్మెల్యే అన్నారు. స్వయంగా సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం చాలా సంతోషంగా ఉందని, సంతృప్తి ఇచ్చిందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అన్నారు. భోజన అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు రాజేందర్ కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అందజేశారు.

## ములుగు జిల్లా వడగండ్ల వాన

హైదరాబాద్ పెన్ పవర్:ములుగు జిల్లాలో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. జిల్లాలోని పలుచోట్ల ఈదురుగాలులతో ములుగు జిల్లావ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవగా గోవిందరావుపేట, మంగపేట, ఏటూరు నాగారం మండలాల్లో తీవ్ర బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులకు వరి నెల వారగా మామిడి తోటలు చెట్టుకు ఒక కాయ లేకుండా రాలిపోయాయి.భీకర గాలులకుగోవిందరావుపేట మండల కేంద్రంలో రేకుల ఇండ్లు నేలమట్టమయ్యాయి. గాలి బీభత్సానికి పాలు చోట్ల చెట్లు నెలరాలాయి. విద్యుత్ సరఫరా కు అంతరాయం కలిగింది. మంగపేట మండలం లో వడగళ్ల వాన కురిసింది.భీకరమైన గాలులకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు.తాడ్వాయి, పసర మధ్యలో ఈదురు గాలులతో చెట్లు పడడంతో పోలీసులు జే సి బి యంత్రంతో చెట్లను తొలగించారు.ఏటూరు,కన్నాయి గూడెం ప్రధాన రహదారి పై చెట్టు విరిగి పడడంతో ఏటూర్ నాగారం పోలీస్ లు చెట్లను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈదురు గాలులతో పాటు వడగండ్ల వానకు జిల్లాలో పలు చోట్ల చెట్లు విరిగి విద్యుత్ స్తంభాల పై పడడంతో విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడింది.

## కోలుకుంటున్న కల్తీ కల్లు బాధితులు

కామారెడ్డి: పెన్ పవర్: కల్తీ కల్లు బారిన పడిన బాధితులు కోలుకుంటున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. బాన్స్ వాడ ఆసుపత్రి లో 58 మంది కి, నిజామాబాద్ జిల్లా ఆసుపత్రిలో 9 మందికి చికిత్స అందిస్తున్నారు. సెటమవారం నాడు కల్తీ కల్లు సేవించి బీర్కూర్, అంకోల్, దామరంచ గ్రామస్తులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిదే. కల్లు డిపో ని అధికారులు సీజ్ చేసారు. అక్కడనుంచి శాంపిల్స్ సేకరించారు. పలువురిపై కేసు నమోదు చేసారు.

# కోకాపేట్ లో అక్రమ కట్టడాల కూల్చివేతలు

రంగారెడ్డి పెన్ పవర్: కోకాపేటలో అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేసారు. కోకాపేట సర్వే నెంబర్ 100 లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు జరిగాయి. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసారు. కబ్జా చేసిన స్థలంలో వ్యాపార సముదాయాల నిర్మాణం జరిగింది. దాంతో గండిపేట రెవెన్యూ అధికారులు మంగళవారం తెల్లవారుజామునే రంగంలోకి దిగి కూల్చివేతలు ప్రారంభించారు. భారీ పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగాయి.


## కడప జైలుకు అహ్మద్ బాషా

హైదరాబాద్ పెన్ పవర్:వైఎస్సార్సీపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా సోదరుడు అహ్మద్ బాషాను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కువైట్‌కు వెళ్లేందుకు ముంబయి విమానాశ్రయానికి చేరుకున్న ఆయన్ని ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకొని కడప పోలీసులకు అప్పగించారు. అక్కడి నుంచి ఆయనను కడప తీసుకొచ్చిన పోలీసులు ఇవాళ సుమారు 8 గంటలపాటు డీటీసీలో విచారించారు.విచారణ అనంతరం అహ్మద్ బాషాను రిమ్స్‌కు తరలించారు. అక్కడి వైద్య పరీక్షలు చేయించారు. ఆ తర్వాత ఆయన్ని కడప కోర్టులో హాజరపరిచారు. ఈ క్రమంలో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అహ్మద్ బాషాకు 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో ఆయనను కడప జైలుకు పోలీసులు తరలించారు.

## టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి ఆనం

హైదరాబాద్ పెన్ పవర్:
నెల్లూరు ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉచిత కుట్టు మిషన్ టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రారంభించారు.ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ %జుబౌ% వారి సహకారంతో మహిళలకు టైలరింగ్ శిక్షణ నిర్వహించనున్నారు.ఉచిత కుట్టు మిషన్ టైలరింగ్ శిక్షణ పొంది ఉపాది దిశగా మహిళలు అభివృద్ధి చెందాలని అన్నారు.

# ఆధార్ బయోమెట్రిక్ వ్యవస్థనే ఏమార్చుతున్న హైటెక్ ముఠా గుట్టురట్టు




హైదరాబాద్ పెన్ పవర్:ఆధార్ కార్డుదారుల బయోమెట్రిక్ వివరాలను తారుమారు చేస్తున్న హైటెక్ ముఠాను ఉత్తరప్రదేశ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠా 12 రాష్ట్రాల్లోని 1,500 మందికి పైగా ఆధార్ కార్డుల బయోమెట్రిక్ డేటాను తారుమారు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.సంభాల్ ఎస్పీ కృష్ణ కుమార్ బిష్ణోయ్, ఏఎస్పీ అనుకృతి శర్మ ఆధ్వర్యంలో సైబర్ టీమ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించి నలుగురు కీలక నిందితులను అరెస్టు చేసింది. నిందితులు యూఐడీఏఐ వ్యవస్థలోని లొసుగులను ఉపయోగించుకుని అక్రమంగా వివరాలు మార్చేందుకు ఏజెంట్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారని పోలీసులు తెలిపారు.
బదాయూన్‌కు చెందిన ఆశిష్ కుమార్, ధర్మేందర్ సింగ్, రౌనక్ పాల్, అమ్రోహాకు చెందిన కాసిం హుస్సేన్‌లను అరెస్టు చేశారు. వీరంతా 20 ఏళ్ల వయస్సు వారేనని పోలీసులు తెలిపారు. నిందితులపై ఆధార్ చట్టం, ఐటీ చట్టం 2016, పాస్‌పోర్ట్ చట్టం 1967లోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.ఈ ముఠా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో 200 నుంచి 300 మంది రిటైలర్లతో ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఏజెంట్లు ఆధార్ కార్డులో పేరు, చిరునామా, పుట్టిన తేదీ లేదా మొబైల్ నంబర్ వంటి వివరాలను అక్రమంగా మార్చాలనుకునే వారి నుంచి పత్రాలను సేకరించి... ఒక్కొక్కరి నుంచి రూ.2,000 నుంచి రూ.5,000 వరకు వసూలు చేసేవారు.
విచారణలో ఇప్పటివరకు 1,500 ఆధార్ కార్డులను తారుమారు చేసినట్లు గుర్తించామని, పుట్టిన తేదీలు, మొబైల్ నంబర్లను మార్చినట్లు కనీసం 400 పత్రాలు లభ్యమయ్యాయని ఏఎస్పీ శర్మ తెలిపారు. ఈ ముఠా రేషన్ కార్డుల డేటాను కూడా తారుమారు చేయడానికి ప్రయత్నించిందని వెల్లడించారు. నకిలీ బయోమెట్రిక్ యాక్సెస్‌ను ఉపయోగించి పేర్లు, చిరునామాలను మార్చినట్లు గుర్తించామన్నారు.
ఈ ముఠాలోని కీలక నిందితుడు ఆశిష్ కుమార్ బీటెక్ చదువు మధ్యలో ఆపేసి ఈ ముఠాకు నాయకత్వం వహిస్తున్నాడు. ఆశిష్ కుమార్ నకిలీ ఆధార్, పాస్‌పోర్ట్ సేవా పోర్టల్‌లను సృష్టించి వాటి ద్వారా నకిలీ పత్రాలను సృష్టించేవాడు. నిందితులు యూఐడీఏఐ వ్యవస్థలోని లొసుగులను ఉపయోగించి ఆధార్ ఆపరేటర్ల బయోమెట్రిక్‌లను క్లోనింగ్ చేసి, అధునాతన సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి జియో-ఫెన్సింగ్ నిబంధనలను అతిక్రమించేవారు. దీని ద్వారా సులభంగా లాగిన్ అయి బయోమెట్రిక్ డేటాను అప్‌లోడ్ చేసేవారు. కాసిం హుస్సేన్ అనే నిందితుడు వేలిముద్ర స్కానర్‌లను ఏమార్చి సిలికాన్ వేలిముద్రలను ఉపయోగించేవాడు. నిజమైన ఆపరేటర్ల నుంచి, ఆర్థికంగా బలహీనంగా ఉన్న వ్యక్తుల నుంచి వేలిముద్రలు సేకరించి వాటితో నకిలీ వేలిముద్రలు తయారు చేసేవారు.
డిసెంబర్ 2024 తర్వాత ధృవీకరణ నిబంధనలు కఠినతరం కావడంతో ఈ ముఠా నకిలీ జనన ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులను ఉపయోగించి 20కి పైగా నకిలీ పాస్‌పోర్ట్‌లను సృష్టించినట్లు పోలీసులు గుర్తించారు.

# బీఆర్ఎస్ వరంగల్ సభను విజయవంతం చేయాలి




హైదరాబాద్ పెన్ పవర్: పండుగ వాతావరణంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్ లో గ్రేటర్ హైదరాబాద్ స్థాయి పార్టీ ముఖ్య నాయకుల సమావేశం మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు %జ% లు సురభి వాణి దేవి, శంభీపూర్ రాజు, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, పలు నియోజకవర్గ ఇంచార్జి లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని డివిజన్ లలో పార్టీ పతాకాలను ఆవిష్కరించడం జరుగుతుందని అన్నారు. పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా అదేరోజు వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి వెళ్లనున్నట్లు చెప్పారు. బహిరంగ సభకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు రేపటి నుండి నియోజకవర్గ స్థాయి సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20 వ తేదీన గ్రేటర్ హైదరాబాద్ జనరల్ బాడీ నిర్వహించడం జరుగుతుందని, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి గా కేసీఆర్ నాయకత్వంలో ఆదర్శవంతమైన పాలనతో అభివృద్ధి లో దేశానికే తెలంగాణ ను రోల్ మోడల్ గా నిలిపారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొన్నారు. వరంగల్ లో జరిగే పార్టీ రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో హాజరై కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణ జీఎస్టీ వృద్ధి 0%కు పడిపోవడంపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శన

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్రంలో జీఎస్టీ (GST) వృద్ధి రేటు గణనీయంగా తగ్గడంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

2025 మార్చి నాటికి జీఎస్టీ వృద్ధి రేటు 0%గా నమోదైందని, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం కేవలం 5.1% వృద్ధి మాత్రమే సాధించినట్లు అధికారిక గణాంకాల ఆధారంగా ఆయన వెల్లడించారు. దేశవ్యాప్తంగా సగటు జీఎస్టీ వృద్ధి రేటు 10% ఉండగా, తెలంగాణ రాష్ట్రం దేశీయ వృద్ధి రేటుతో పోలిస్తే చాలా వెనకబడి ఉందని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా, శాసనసభలో ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, "జీఎస్టీ వృద్ధి 12.3%గా ఉందని శాసనసభలో ప్రకటించడం శోచనీయం" అని హరీశ్ రావు అన్నారు. అయితే, అధికారిక గణాంకాలను పరిశీలిస్తే, భట్టి గారి వాదనలు పూర్తిగా అవాస్తవమైనవిగా తేలిపోయాయని వారు స్పష్టం చేశారు. బడ్జెట్ సమావేశాల్లో నేను ఈ విషయాన్ని ప్రస్తావించి, రాష్ట్ర జీఎస్టీ వృద్ధి రేటు 5.5%కు పరిమితమవుతుందని హెచ్చరించాను. మా సలహాలు,హెచ్చరికలను ఈ ప్రభుత్వం పట్టించుకోలేదు అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ప్రస్తుతం అధికారికంగా తెలంగాణ వృద్ధి రేటు కేవలం 5.1% మాత్రమేనని ధృవీకరించబడిందని చెప్పారు. తెలంగాణలో



ఇంత తక్కువ జీఎస్టీ వృద్ధి ఇప్పటివరకు ఎన్నడూ నమోదు కాలేదు, కోవిడ్-19 లాక్డౌన్ కాలంలో తప్ప. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం, నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనమని ఆయన అన్నారు.

రాష్ట్ర వృద్ధి రేటు క్రమంగా తగ్గడానికి గత 15 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు కారణమని హరీశ్ రావు గారు పేర్కొన్నారు. "క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలు అమలులో లోపాలు, రైతు భరోసా ద్వారా పంట పెట్టుబడి సహాయం అందించకపోవడం, రైతు భరోసా పథకం కింద రూ.12,000 కోట్ల నిధులు విడుదల చేయకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఖర్చు సామర్థ్యం తగ్గిపోయింది. అలాగే, హైడ్రా, మూసీ ప్రాజెక్టుల వంటి తప్పుడు విధానాలతో భయాందోళనలు సృష్టించి పెట్టుబడులు రాకుండా చేయడం, ఫార్మా సిటీ, మెట్రో రైలు ప్రాజెక్టులను రద్దు చేయడం వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతింది" అని ఆయన వివరించారు.ప్రజల చేతిలో డబ్బు లేకపోతే వినియోగం ఎలా పెరుగుతుంది? ఆర్థిక మంత్రి శాసనసభను మాత్రమే కాదు, తెలంగాణలోని ప్రతి పౌరుడిని మోసం చేశారు. ఇది సిగ్గుచేటు అని హరీశ్ రావు గారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి, మోసపూరిత అంకెల గారడీతో మోసం చేయకుండా, వాస్తవాల ఆధారంగా పాలన అందించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు అని హరీశ్ రావు గారు హితవు పలికారు.

# అనుముల ఇంటెలిజెన్స్ రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తోంది

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేసారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో చాలా ప్రమాదముందని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారు. ఏఐ అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాదు... ఏఐ అంటే అనుముల ఇంటెలిజెన్స్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో కాదు.. అనుముల ఇంటెలిజెన్స్ తో రాష్ట్రానికి ప్రమాదం ఉంది. అనుముల ఇంటెలిజెన్స్ రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తోంది. అనుముల ఇంటెలిజెన్స్ పక్కకు జరిగితే తప్పా రాష్ట్రం బాగుపడే పరిస్థితి కనిపించడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలు వెబ్ సైట్ లో పెట్టాము. మరి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఆ ధైర్యం లేదు ? 2011లో యూపీఏ హయాంలో దేశంలో కులగణన చేసినా ఇప్పటికీ వివరాలు వెల్లడించలేదు తెలంగాణలో చేసిన కులగణన వివరాలను వెల్లడించలేదు. బీసీ కులగణన చేయబోమని బీజేపీ స్పష్టం చేసింది కాబట్టి ఆ పార్టీపై ఒత్తిడి చేయాలి. కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంతో మేము కూడా కలిసి వస్తాం. కానీ కాంగ్రెస్ లాగా ఢిల్లీలో దొంగ దీక్షలు చేయము. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి నిరవధికంగా దీక్షలు కూర్చుందాం. చట్టసభలు బిల్లులు ఆమోదించి నాలుగు వారాలైంది. ప్రస్తుతం ఆ బిల్లుల స్థితి ఏమిటో ప్రభుత్వం చెప్పాలి. గవర్నర్ వద్దనే పెండింగ్ లో ఉన్నాయా... లేదా రాష్ట్రపతికి పంపించారా ? బిల్లులు ఆమోదం పొందిన తర్వాత అన్ని పార్టీలను ప్రధాని వద్దకు తీసుకెళ్తామని సీఎం అన్నారు. కానీ ఇప్పటి వరకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి వెళ్లలేదు. బీజేపీతో సీఎం రేవంత్ రెడ్డికి లాలూచి లేకుంటే ప్రధాని అపాయింట్ మెంట్ లభించేది. బీజేపీని కాపాడడానికి కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లడం లేదని అన్నారు.

దానికి బదులు ఢిల్లీలో తుఫేల్ ధర్నా చేశారు. ధర్నాకు రాహుల్ గాంధఈ వస్తారని ఊదరగొట్టారు కానీ చివరికి ఆయన రాలేదు. ఢిల్లీలో కూడా ముఖ్యమంత్రి తెలుగులో మాట్లాడారు. ఢిల్లీ పెద్దలపై ఒత్తిడి తేవాలంటే వాళ్లకు అర్థమయ్యే భాషలో మాటల్లో మాట్లాడాలి. కులగణన అధ్యయనం పూర్తి చేసే వరకు మనం మాట్లాడవద్దని స్వతంత్ర అధ్యయన సంస్థ హెచ్చరిక చెబుతోంది, మీరెవరు మాకు హెచ్చరిక చేయడానికి. చిత్తశద్ధి ఉంటే కులగణన నివేదికను అసెంబ్లీలో పెట్టండి. ఏప్రిల్ 11లోగా పూలే విగ్రహం ఏర్పాటుపై ప్రకటన చేయాలని అన్నారు.

దేశంలో తరతరాలుగా వెనుకబడ్డ జాతులకు న్యాయం జరగాలని కాంక్షించిన వ్యక్తి పూలే. పూలే తనకు గురువు అని అంబేద్కర్ చెప్పారు. మహిళల కోసం పాఠశాలలను ఏర్పాటు చేసిన గొప్ప వ్యక్తి పూలే. కులవివక్షకు వ్యతిరేకంగా అవిశ్రాంతంగా పోరాటం చేశారు. అసెంబ్లీలో పూలే విగ్రహం పెడితే సమాజం స్ఫూర్తి పొందుతుంది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా విగ్రహం కోసం పోరాటం చేస్తామని అన్నారు.

## దాది రతన్ మోహినీ జీ మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రహ్మకుమారీస్ గ్లోబల్ సెంటర్ల చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ హెడ్గా సేవలందించిన రాజయోగిని దాది రతన్ మోహినీ జీ గారి మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

దాది జీ జీవితం ఆదర్శాత్మకమైనది, ఆమె ఆధ్యాత్మిక బలానికి, నిర్మలత్వానికి, మరియు విశ్వ సోదరభావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఆమె భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా 140కి పైగా దేశాల్లో విస్తరించి, సమాజానికి శాంతి మరియు మానవతా విలువల సందేశాన్ని అందించారని కొనియాడారు. దాది గారి మృతి రాష్ట్రానికి, దేశానికి విశ్వ ఆధ్యాత్మికతకు తీరని లోటని పేర్కొంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆమె జీవితం ప్రతి ఒక్కరికి మార్గదర్శిగా నిలుస్తుందన్నారు.

## బహిరంగ సభకు కూడా అనుమతులు ఇవ్వకుంటే కోర్టును ఆశ్రయిస్తాం

**హైదరాబాద్ పెన్ పవర్:** పార్టీ సిల్వర్ జూబ్లీ సంబరాల నిర్వహణ పైన భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడారు. వరంగల్ ఎల్కతుర్తిలో ఎలాంటి ట్రాఫిక్ లేకుండా, ప్రజలకు ఇబ్బంది కానీ ప్రాంతంలో సభ నిర్వహణ జరుగుతుంది. 1200 ఎకరాల్లో పార్కింగ్ తో పాటు సభ ఏర్పాటు అన్ని ఘనంగా జరుగుతున్నాయి. తెలుగునాట విజయవంతంగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న రెండు పార్టీలు తెలుగుదేశం, బిఆర్ఎస్ మాత్రమే. అందుకే ఏడాదిపాటు సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు చేస్తాం. 28వ తేదీ మార్చి రోజున సభ అనుమతి కోసం జిల్లా పోలీసులకు దరఖాస్తు పెట్టడం జరిగింది. ఈ మేరకు డీజీపీకి వ్యక్తిగతంగా విజ్ఞప్తి కూడా చేశాము . ఆర్టీసీ ద్వారా 3000 బస్సుల కోసం విజ్ఞప్తి చేశాను ఆర్టీసీ సూత్రప్రాయంగా అంగీకరించింది. 27వ తేదీ ఆదివారం కావడం విద్యార్థులకు సెలవులు ఉండటం ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగవు . 33 జిల్లాల నాయకులు ప్రతినిధులతో కేసీఆర్ గారు స్వయంగా నియోజకవర్గాల వారికి సమీక్ష నిర్వహించారు. పార్టీ పరంగా కమిటీలను వేసుకోవడం జరిగింది. మా పార్టీ చరిత్రలో ఈ సమావేశం ఒక పెద్ద మీటింగ్ అవుతుంది. గతంలో జరిగిన వరంగల్ సభ మాదిరి భారీగా నిర్వహణ చేయబోతున్నామని అన్నారు. బహిరంగ సభ తర్వాత విద్యార్థి , కార్యకర్తల సభ్యత్వ నమోదు చేస్తాం. సభ్యత నమోదు పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతుంది. సభ్యత్వ నమోదు తర్వాత అధ్యక్ష ఎన్నిక జరుగుతుంది. రాష్ట్ర కమిటీలతో పాటు జిల్లా కమిటీలను ఇతర కమిటీలను వేసుకుంటాం. ఆ తర్వాత జిల్లాల వారీగా కార్యకర్తల శిక్షణ సమావేశాలు ఉంటాయి. ప్రతినెల ఒక్కొక్క కార్యక్రమాన్ని నిర్వహించేలా 12 నెలలపాటు కొనసాగేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. ఈ సంవత్సరం మొత్తం సంస్థాగత నిర్మాణంతోపాటు , ప్రజా సమస్యల పైన పోరాటం చేస్తాంమని అన్నారు.

ప్రభుత్వం గతంలో మా పార్టీ సమావేశాలకు అనుమతులు ఇవ్వకుంటే ఇబ్బందులు పెట్టింది . ఈ బహిరంగ సభకు కూడా అనుమతులు ఇవ్వకుంటే కోర్టును ఆశ్రయించి అనుమతి పొందుతామని అన్నారు. అనుమతి ఇవ్వక పోవడానికి ప్రభుత్వం వద్ద ఇలాంటి కారణాలు లేదు . అత్యంత శాంతియుతంగా పార్టీ నిర్వహించుకుంటున్న ఒక సంబరం మాత్రమేనని అన్నారు.

# ఈ తొమ్మిది రకాల డ్రింక్స్ తాగండి..2 వారాల్లో మీ లివర్ ఫ్యాట్ ఇట్టే కరిగిపోతుంది..!



హైదరాబాద్ పెన్ పవర్:కాలేయం మానవుని శరీరంలోని అతి పెద్ద గ్రంథి. ఇది పొట్టలో పక్కటెముకల కింద మధ్యలో ఉంటుంది. కాలేయము పైత్యరసాన్ని తయారుచేస్తుంది. అది పిత్తాశయంలో నిలువచేయబడి జీర్ణక్రియలో చాలా తోడ్పడుతుంది.కాలేయం జీర్ణక్రియ, వ్యర్థాలను తొలగించడం, శక్తిని నిల్వ చేయడంలో సాయం చేయడం ద్వారా జీర్ణ వ్యవస్థ పనిచేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అటువంటి కాలేయంలో కొవ్వు పేరుకుపోతే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అటువంటి కాలేయంలో కొవ్వుకు కరిగించడం ఎలా? కాలేయాన్ని ఎలా ఆరోగ్యంగా ఉంచుకోవాలో ఈ ఆర్టికల్ లో తెలుసుకుందాం.

సరైన ఆహారం,జీవనశైలితో కూడా కొవ్వు కాలేయాన్ని నిర్మూలించవచ్చు. ఈ తొమ్మిది రకాల సాధారణ పానియాలు లివర్ ను పరిశుభ్రం చేసి, వాపును తగ్గిస్తాయి. కొవ్వు మెటబాలిజమ్ మెరుగుపరుస్తుంది. మొత్తం కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ,రెండు వారాలలో కొవ్వు తగ్గడాన్ని ప్రోత్సహించడానికి సహాయపడతాయి.

**అల్లం టీ**

అల్లంలో జింజెరాల్ ఉంటుంది.ఇది కొవ్వు జీర్ణక్రియ,జీవక్రియను సులభతరం చేస్తుందని నిరూపించబడింది. అల్లం టీని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కాలేయ కొవ్వు,వాపు తగ్గుతుంది. అదే సమయంలో క్లోమం ఉత్పత్తి, వినియోగంలో సహజమైన పద్ధతిలో సహాయపడుతుంది.

**గ్రీన్ టీ**

గ్రీన్ టీ లో ముఖ్యంగా కాటెచిన్లతో కూడిన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. గ్రీన్ టీ కాలేయం పనితీరును మెరుగుపరుస్తుంది. లివర్ లో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గిస్తుంది. జీవక్రియను పెంచడానికి ,కాలేయాన్ని శుద్ధి చేయడానికి, సహజ కొవ్వు తగ్గడానికి రోజుకు 2నుంచి3 కప్పుల గ్రీన్ తీసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి.

**అలోవెరా జ్యూస్**

కలబంద(అలోవెరా) ఇది లివర్ వాపును తగ్గిస్తుంది.కాలేయాన్ని నయం చేస్తుంది. దీని ఎంజైమ్‌లు జీర్ణం కావడానికి,కొవ్వు విచ్ఛిన్నం చేయడానికి బాగా ఉపయోగపడతాయి. క్రమం తప్పకుండా అలోవెరా జ్యూస్ తీసుకోవడం వల్ల నెమ్మదిగా నిర్విషీకరణకు సహాయపడుతుంది.కాలక్రమేణా ఫ్యాటీ లివర్ వ్యాధి రాకుండా అడ్డుకుంటుంది.

**బ్లాక్ కాఫీ**

కాలేయ ఎంజైమ్ స్థాయి తగ్గించడం, కొవ్వు ఆక్సీకరణను పెంచడం ద్వారా బ్లాక్ కాఫీ కొవ్వు కాలేయ వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. దీనిని మితంగా తీసుకుంటే మంచిది. ఇది కాలేయ ఆరోగ్యాన్ని కాపాడటం, కొవ్వు జీవక్రియను పెంచేందుకు దోహదం చేస్తుంది.

**ఉసిరి రసం**

ఉసిరి రసంలో అధిక స్థాయిలో విటమిన్ సి ,యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కాలేయం దెబ్బతినకుండా రక్షిస్తాయి. నిర్విషీకరణను పెంచుతాయి,కొవ్వు పేరుకుపోవడాన్ని నిరోధిస్తాయి. ప్రతిరోజూ ఉదయం ఒక గ్లాసు ఉసిరి రసం కాలేయం పనితీరు ,రోగనిరోధక స్థితిస్థాపకతను మెరుగుపర్చడంలో సహాయపడుతుంది.

**పసుపు పాలు**

పసుపులో ఉండే క్రియాశీల సమ్మేళనం కర్కుమిన్. ఇది ఒక యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీఆక్సిడెంట్ పదార్థం. వెచ్చని పాలతో పసుపు కలిపినప్పుడు ఇది కాలేయ కణాల పునరుత్పత్తికి మద్దతు ఇస్తుంది. ఆక్సీకరణ ఒత్తిడిని నిరోధించడం ద్వారా లిపిడ్ ప్రొఫైల్‌ను సహజంగా అదుపులో ఉంచడం ద్వారా కాలేయ కొవ్వును తొలగిస్తుంది.

**బీట్‌రూట్ రసం**

బీట్‌రూట్ లో నైట్రేట్లు,బీటాలైన్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ రసం రక్త ప్రవాహాన్ని పెంచుతుంది.కాలేయంపై ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇది విషాన్ని తొలగించడంలో సహాయపడుతుంది.కొవ్వు జీవక్రియకు సపోర్ట్ ఇస్తుంది.తద్వారా కాలేయం సన్నగా ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది.

**నిమ్మకాయ నీరు**

నిమ్మకాయ నీరు కాలేయం సహజ ఎంజైమ్‌లను క్రమబద్ధీకరిస్తుంది. క్లోమ రసం ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. జీర్ణక్రియ ,కొవ్వు జీవక్రియను సులభతరం చేస్తుంది. ఉదయం పూట నిమ్మకాయ నీరు తాగితే తేలికపాటి డీటాక్స్ ప్రభావాన్ని కలిగిస్తుంది. ఇది కాలేయ కణాలను బయటకు పంపి పునరుజ్జీవింపజేస్తుంది.

# క్రెడిట్ కార్డ్ క్లోజ్ చేస్తే సిబిల్ స్కోర్‌కి దెబ్బే.. ఇలా చేస్తే సేఫ్..!




హైదరాబాద్ పెన్ పవర్:ఈ రోజుల్లో చాలా మంది ఉద్యోగాలు చేస్తున్నందున సులువుగా బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి క్రెడిట్ కార్డులను పొందుతున్నారు. కొంత మంది వద్ద ఇవి మితంగానే ఉంటున్నప్పటికీ మరికొందరి వద్ద మాత్రం ఎక్కువ సంఖ్యలో ఉంటున్నాయి. ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వ్యక్తులు కార్డులను సక్రమంగా వినియోగించుకోవటంతో పాటు సకాలంలో ఆ బిల్లుల చెల్లింపులను మిస్ కాకుండా కడుతుంటారు. కొందరి విషయంలో ఇది గాడి తప్పుతుంది. తమ ఆర్థిక స్థోమతకు మించి కార్డును వినియోగించే కొందరు వాటిని కొన్ని సార్లు క్లోజ్ చేసుకోవాలని చూస్తుంటారు. వాస్తవానికి వారి దృష్టిలో ఇది మంచి నిర్ణయమే అయినప్పటికీ ఇది సదరు వ్యక్తుల క్రెడిట్ స్కోర్‌ని భారీగా దెబ్బతీస్తుంది. ఇక్కడ చాలా మందికి కలిగే అనుమానం అసలు క్రెడిట్ స్కోరుకు క్రెడిట్ కార్డును క్లోజ్ చేయటానికి మధ్య ఉండే సంబంధం ఏంటన్నదే. భారతదేశంలో నిబంధనల ప్రకారం క్రెడిట్ కార్డును క్లోజ్ చేయటం వల్ల అది వ్యక్తి క్రెడిట్ హిస్టరీని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని గమనించాలి. అయితే మీ క్రెడిట్ స్కోర్ లేదా హెల్త్ పాడవకుండా తెలివిగా కార్డులను ఎలా క్లోజ్ చేసుకోవచ్చనే విషయాలను తెలుసుకోవాల్సిందే..

ఒక్కసారిగా మీరు క్రెడిట్ కార్డును క్లోజ్ చేయటం ద్వారా మీ క్రెడిట్ యుటిలైజేషన్ పెరిగి స్కోర్ దెబ్బతీస్తుంది. క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో అధికంగా ఉంటే మీరు అధికంగా రుణాలపై ఆధాపడుతున్నట్లు అర్థం. అందువల్ల మెరుగైన క్రెడిట్ స్కోర్ కలిగి ఉండటానికి మొత్తం అందుబాటులోని కార్డుల లిమిట్‌లో కేవలం 30 శాతాన్ని మాత్రమే వాడటం ఉత్తమం.

ఇక మీరు ఏదైనా క్రెడిట్ కార్డును క్లోజ్ చేయటం ద్వారా మీ క్రెడిట్ హిస్టరీ నుంచి దాని వివరాలు తొలగించబడతాయి. ఉదాహరణకు మీరు పాత క్రెడిట్ కార్డును క్లోజ్ చేస్తే అది మీకు తక్కువ క్రెడిట్ హిస్టరీనికి కలిగి ఉండేలా చేస్తుంది. దీంతో క్రెడిట్ హిస్టరీ వయస్సును తగ్గిస్తుంది. అలాగే సమయానికి కార్డు చెల్లింపులను సైతం క్రెడిట్ రిపోర్టులో పరిగణలోకి తీసుకుంటారు. అందువల్ల మంచి క్రెడిట్ పేమెంట్ హిస్టరీని కలిగిన కార్డును తొలగించటం మీ క్రెడిట్ వర్థినెస్ తగ్గేలా చేస్తుందని గమనించాలి.

**మీరు ఎలాంటి సందర్భాల్లో క్రెడిట్ కార్డును క్లోజ్ చేయటం ఉత్తమం..?**

కార్డులను క్లోజ్ చేయటం వల్ల కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, కొన్ని సరైన కారణాలను చూపుతూ క్రెడిట్ కార్డులను క్లోజ్ చేయటం మంచిది.

తక్కువ ప్రయోజనాలను కలిగిన ఎక్కువ యాన్యువల్ ఫీజుండే కార్డులు

సెక్యూరిటీ లేదా మోసం వంటి కారణాలు

ఉన్న కార్డు కంటే మెరుగైన రివార్డ్స్, వడ్డీ రేట్లను కలిగి ఉండే క్రెడిట్ కార్డుకు మారటం

మిగిలిపోయిన చిన్న చెల్లింపులను కూడా భారీ మొత్తాలుగా పెంచటం

ఈ టిప్స్ పాటించటం వల్ల కార్డు క్లోజ్ చేసినప్పుడు సిబిల్ స్కోరుపై ప్రభావం తక్కువగా ఉండే అవకాశం..

ఎలాంటి వార్షిక రుసుములు లేని పాత కార్డులను కొనసాగించటం

ఒకేసారి అనేక క్రెడిట్ కార్డులను క్లోజ్ చేయకుండా ఉండటం

కార్డులను క్లోజ్ చేసిన తర్వాత, చేయటానికి ముందు క్రెడిట్ స్కోరులోని తేడాలను పరిశీలించటం

కార్డును యాక్టివ్ గా ఉంచేందుకు తరచుగా దానిని వినియోగంలో ఉంచటం